క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నర్సిపురం, ఎమ్మార్‌నగర్, బందలుప్పి 11 కేవీ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతున్న గ్రామాలతో పాటు వైకేఎం కాలనీ, వెంకంపేట, అఫీషియల్ కాలనీ, వసుంధరానగర, తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీరంగరాజపురంలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బలిజిపేట: మండలంలోని గలావల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉండే శ్రీరంగరాజపురంలో వైద్య సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇద్దరు వైద్యాధికారులు నలుగురు సిబ్బంది కలిసి రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అయితే గ్రామంలో సంచార వైద్యశిబిరం నిర్వహించినా, సిబ్బందికి కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కనీసం నిలువ నీడ లేకపోవడంతో ఆరుబయటే రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.రుషికుమార్, బి.రేవతి, స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామగ్రితో బోధన


అభ్యసనా పరికరాలను చూపిస్తున్న ఎంఈఓ - 1 సామల సింహాచలం

బలిజిపేట: తరగతి గదిలో బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించి బోధించడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎంఈఓ - 1 సామల సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ నూతన బోధనా విధానాలను అమలు చేయాలన్నారు. అకడమిక్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బలిజిపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిమాలలు, పూలతో స్వామివారిని,దేవేరులను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకోగా.. అర్చకుడు సురేష్‌స్వామి తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

పక్కాగా చెత్త సేకరణ

సాలూరు: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలో చేపడుతున్న పారిశుధ్య పనులను ప్రజారోగ్య విభాగాధికారి బాలకృష్ణతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

సాలూరులో కార్డన్ సెర్చ్


పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సాలూరు: ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు పట్టణంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్, బంతి స్టేడియం, ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలు, డబ్బివీధి, చెరువు గట్టు, తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంలో పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎనిమిది లీటర్ల సారా పట్టుబడిందని ఎస్సై తెలిపారు.

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

లోకేశ్‌ను నిలదీయడానికి ప్రజలు సిద్ధం..


పట్టణంలోని నాలుగో వార్డులో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు


ఎమ్మార్‌నగరంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్:

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని.. లేకపోతే తమను ప్రజలు కాలర్ పట్టుకుని నిలదీయవచ్చని చెప్పిన నారా లోకేశ్ కాలర్ పట్టుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి సామాన్యుడి నడ్డివిరిగేలా పెంచారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని, దీనివలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలకు ప్రభుత్వపరంగా దక్కాల్సిన లబ్ధి ఏమాత్రం అందడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అస్తవ్యస్త పాలనపై ఎవరు ప్రశ్నించినా తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, మాటలకు గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు మాయల మరాఠీ అని అన్నారు. కూటమి అసమర్థ పాలనను ప్రజలకు వివరించడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు.. నిరుద్యోగులకు రూ.3 వేలు.. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1500.. అలాగే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు.. ఉచిత గ్యాస్ సిలిండర్లు.. మహిళలకు ఉచిత ప్రయాణం.. వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ బి. రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధి మువ్వల సత్యంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బడే రామారావు, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు మడక విశ్వనాథం, యాంద్రాపు తిరుపతిరావు, బంకపల్లి వాసుదేవరావు, చందాన శివాజీ, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు బలగ నాగేశ్వరరావు, వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు యాళ్ల ప్రతాప్, గండి శంకరరావు, పెండ రమణ, బడే శ్రీరంజన్, గొర్లి రాజు, ఎంపీటీసీ సభ్యులు ఏగిరెడ్డి రమణ, మద్రాపు వాసుదేవరావు, తాడూరు సోములమ్మ, మండల నాయకులు మజ్జి శేఖర్, చింతల ప్రసాద్, ఉరిటి అప్పలనాయుడు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పెద్దలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగో వార్డులో..

పార్వతీపురం మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో వివేకానంద విగ్రహం నుంచి స్థానికంగా ఉన్న కల్యాణ మండపం వెనుక వీధి వరకు పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకుల వంచనను వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోని గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, స్థానిక కౌన్సిలర్ కోరాడ శ్రీనివాసరావు (నాని), బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, కౌన్సిలర్ సభ్యులు వై. త్రినాథ, ఎస్. సుధీర్, వి. నేతాజీ, ఇన్‌చార్జ్‌లు జి. పద్మావతి, జి. గాయత్రి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు కాగాన ప్రకాష్, ముగడ జగన్‌మోహనరావు, గండి భాగ్యలక్ష్మి, దేవుపల్లి నాగరాజు, యూత్ ప్రెసిడెంట్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రవి, ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి, బోను ఆదినారాయణ గండి లక్ష్మి, గండి ప్రభావతి, పి. రాధ, బి. శ్రీనివాసరావు, డి. గురుమూర్తి, తంబి పాల్, గంగరాజు, బడే గౌరినాయుడు, రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నయవంచనే చంద్రబాబు నైజం..


పెద్దింపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

బలిజిపేట: నయవంచన చంద్రబాబు నైజమని.. ఆయన మోసాలను ప్రజలు గుర్తించాలని జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ తెలిపారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు సర్పంచ్ జయప్రకాష్ ఆధ్వర్యంలో పెద్దింపేటలో చంద్రబాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పడం.. అమలుకాని హామీలను ఇవ్వడం.. తర్వాత వాటిని అమలు చేయకపోవడం చంద్రబాబుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, మేధావుల సంఘ జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం డైరెక్టర్ వాసుదేవరావు, మండల యువజన సంఘ అధ్యక్షుడు రణదేవ్ లక్ష్మణరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏసు, మండల వీవర్స్ అధ్యక్షుడు నారాయణరావు, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కూటమి పాలనను తూర్పారబడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సూపర్ సిక్స్ పేరుతో కుచ్చు టోపీ..


క్యూఆర్‌కోడ్ పత్రాలను ప్రజలకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టిరాజు, తదితరులు

సీతానగరం: కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలకు కుచ్చు టోపీ పెట్టారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు గెడ్డలుప్పిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న పత్రాలతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ. తిరుపతిరావు, పి. బాలకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె. శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు కె. వెంకయ్య, పి. కాశినాయుడు, బంకురు శంకరరావు, వి. వేణు, అల్లు విజయలక్ష్మి, అక్కపోలు సింహాచలం, రెడ్డి వెంకటరమణ, వై. గోపాల్, బి. తిరుపతిరావు, సీహెచ్ అమ్మడమ్మ, కిరణ్‌కుమార్, వై. గౌరమ్మ, కలిగి తౌడయ్య, శ్యామలరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొట్టిన అంగన్‌వాడీ కార్యకర్త


చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

సాలూరు: పట్టణంలోని వేద సమాజం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టడంపై సీడీపీఓ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయగా.. కార్యకర్త గంట్రెడ్డి గౌరి లేరు. ఆమె సెలవు పెట్టారా అని సూపర్‌వైజర్ ధనలక్ష్మిని అడగ్గా.. సెలవు పెట్టలేదని, సెలవు చీటీ కూడా ఇవ్వలేదని చెప్పారు. సెలవు పెట్టకుండా విధులకు డుమ్మా కొట్టడం సరికాదని సీడీపీఓ అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం చిన్నారుల తల్లులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి


ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

శృంగవరపుకోట: పట్టణంలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈతరుణంలో పట్టణ పోలీసులు పర్మిషన్లు లేవంటూ ర్యాలీని ఆపేప్రయత్నం చేసినా విద్యార్థులు గట్టిగా ప్రతిఘటించటంతో పోలీసులు మిన్నకున్నారు. అనంతరం విద్యార్థులు హాస్టల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబా బు మాట్లాడుతూ ఎస్.కోట ఎస్టీ బాలుర వసతి గృహంలో అదనపు గదులు, అదనపు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.ఎస్ఎఫ్ఐ నేతలు పి.రమేష్, భారతి, రత్న, అనిత, చరణ్, తిలక్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు, తదితరులు

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని ఎండీఎం(మధ్యాహ్న భోజనం) నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు తెలిపారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సామూహిక వంటశాలల విధానం ద్వారా మండలానికి ఒక్క వంటశాల మాత్రమే ఏర్పాటు చేయాలన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. అలాగే ఎండీఎం నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ వర్తింపజేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 3వ తేదీన పార్వతీపురంలో మహాసభ ఉంటుందని, సెప్టెంబరు 13, 14 తేదీల్లో పాలకొండలో.. డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో ఈ మహాసభలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకుల సంఘం నాయకులు బారమ్మ, ఉషా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే మనకు మంచి గుర్తింపు ఉంటుందని ఎల్విన్‌పేట సీఐ బి.హరి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుమ్ముంగి గ్రామంలో సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పర్యటించిన ఆయన..గ్రామస్తులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మంచి నడవడిక అలవర్చుకోవాలని, చెడు అలవాట్లు బారినపడి జీవితం నాశనం చేసుకోవద్దని తెలిపారు.

ముఖ్యంగా యువతీ యువకులు బాగా చదువుకుంటూనే క్రీడల్లో కూడా బాగా రాణించాల ని ఆకాంక్షించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి న ఎంతోమంది జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. అనంతరం ఆ గ్రామ యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సదుపాయాల కల్పనకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ డీపీటీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం కాంప్లెక్స్‌ను సందర్శించి, స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు ఏయే సౌకర్యాలు అవసరమో అభిప్రాయ సేకరణ చేశామని, వారు కోరుకుంటున్న సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం


నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలే కరులతో శనివారం మాట్లాడారు. వైఎస్సార్ సీ పీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల కొరత లేకుండా చూశామని, రైతుల కు సకాలంలో కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందివ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎరువులు, విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తోందన్నారు. మరోవైపు ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైనా రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి అన్నిరకాల అన్యాయమే జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఎందుకు ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామా అని బాధపడుతున్నారన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం


బెల్లంఊటల డ్రమ్ములు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సీతంపేట: మండలంలోని లోవగూడ పరిసరాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల బెల్లంఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేసినా రవాణా చేసినా విక్రయించినా సమాచారం ఇవ్వాలని, వివరాలు చెప్పిన వారి గూర్చి గోప్యంగా ఉంచుతామన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయండి.

శృంగవరపుకోట: ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ నిధులను తక్షణం విడుదల చేయాలని దళిత ఉద్యమ నేత భాస్కర్ డిమాండ్ చేశారు. ఎస్.కోటలో శనివారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు.అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధు లు పి.సూరిదేముడు, డోల కేశవ, గుర్రపు శ్రీను, బోనెల ఈశ్వరరావు, తెరపల్లి సూరిబాబు, ఎస్.కృష్ణ, ఎద్దు సూర్యారావు, డెంకాడ సోమేష్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సర్పంచ్ టి. సత్యవతి పర్యవేక్షణలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన చేపడుతున్న పనులను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పెదంకలాం పీహెచ్‌సీ వైద్యురాలు పి. రమ్యసాయి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైద్యశిబిరం జ్వరాలు తగ్గేవరకూ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె. కుమారవర్మ, గ్రామ పెద్దలు బి. శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు

మక్కువ: పీ - 4 కార్యక్రమంలో భాగంగా మండలంలోని నంద గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. శ్రీకాంత్ మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతో శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్నతాధికారులు సన్మానించారు. సాలూరు నియోజకవర్గ సీపీఎస్‌పీ నోడల్ అధికారి, డ్వామా పీడీ కె. రామచంద్రరావు చేతుల మీదుగా ఉత్తమ మార్గదర్శిగా గుర్తించి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రతి ఒక్క ఉద్యోగి బంగారు కుటుంబాల దత్తత బాధ్యతలు తీసుకోవాలని నోడల్ అధికారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, డిప్యూటీ ఎంపీడీఓ ఎన్. సూర్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి శ్యామ్‌సుందరరావు, సీడీపీఓ బి. అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

సాక్షి ఎఫెక్ట్...


తల్లులతో సమావేశమైన సూపర్‌వైజర్ హైమావతి

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మల్లివీడు సెక్టార్ సూపర్ వైజర్ కె.హైమావతి సందర్శించారు. గేదెలవానిపాలెంతో పాటు మండలంలోని పలుగ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలకు రాకపోతుండడంతో 'బోసిపోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈమేరకు గేదెలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమావతి సందర్శించడంతో పాటు గ్రామంలో పర్యటించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తల్లులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నామని అవగాహన కల్పించారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించండి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను త్వరగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. గతంలో ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమితులైన ఏఎన్‌ఎంలు ఉండడం ద్వారా గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాగుండేదని, ఇప్పుడు వారు లేకపోవడంతో విద్యార్థుల ఆకస్మిక మరణాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ఇవ్వడమే కాదని, మెరుగైన ఆరోగ్య భరోసాను కూడా ఇవ్వాలని హితవు పలికారు. ప్రభుత్వానికి విద్యార్థుల సంక్షేమం, భద్రత పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఏఎన్‌ఎంల నియామకం చేపట్టాలన్నారు. ధర్నా చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన


జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భామిని: మండలంలోని పక్కుడుబద్రలో జీవామృతం తయారీపై ఏపీసీఎన్ఎఫ్‌లు బి.మోహనరావు, పి.అరుణలు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం పంటలపై జీవామృతం పిచికారీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, అలాంటప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ సీవోలు కె.శారద, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.